


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'ఆ పాప పరిగెత్తే ప్రతీ పందెంలోనూ ముందుండడానికి, ముందంజ వెయ్యడానికీ మన వంతు సహాయం చేద్దాం'

డా.రాజేష్ మాటలు చెవుల్లో మళ్ళీ మళ్ళీ వినిపిస్తుంటే ఏదో చేజారిన పెన్నిధి లా ధైర్యం దొరికినట్టనిపించసాగింది రాధిక కి.

ఆపుకోలేనంత ఉద్వేగంతో ఆయన చేతులు పట్టుకుని

" ఏది చేసినా మీరే చెయ్యాలి. మీకంటే మాకెవ్వరూ లేరు. తెలియదు. " అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది మళ్ళీ.

" ప్లీజ్! మీరు ధైర్యంగా ఉండాలి ముందు. మనం ధైర్యంగా ఉంటేనే స్వప్నికి అనుమానం రాకుండా, మామూలుగా ఉంటుంది కదా! నేను తప్పకుండా వెంటనే ప్రయత్నం మొదలుపెడతాను" అన్నాడాయన.

“థాంక్ యూ డాక్టర్!!” అన్నాడు కిరణ్ రాధిక భుజం మీద తడుతూ.

చీరకొంగుతో కళ్ళు తుడుచుకుని కృతజ్ఞతగా చూసింది రాధిక తమ డాక్టర్ మిత్రుడివైపు.

" ఏ బంధాలిలా మనుషుల్ని కలుపుతాయి? తన బిడ్డకి జ్వరం వస్తే ఓ ఇంజక్షనో, జలుబు చేస్తే ఓ టాబ్లెటో ఇచ్చే డాక్టర్ కి తన పేషెంట్ మీద ఇంత ప్రేమా? అందుకే వైద్యులు మానవరూపంలో ఉన్న దైవాలు అనేది" ఇలాంటి భావాలతో ఆమె మనసంతా నిండిపోయింది.

“మీరు ఎలా అంటే అలాగే చేద్దాం" అంది రాధిక.

“నేను వెంటనే ప్రకటన తయారు చేయిస్తాను. అది ప్రచురిస్తే చూసినవారు స్పందించడం మొదలుపెడతారు. వీలైనన్ని ఎక్కువ చోట్ల ఎక్కువ మందికి చేరేలా చూస్తే మన పని సులభం అవుతుంది” అన్నారు డా.రాజేష్.

" అందరికీ తెలుస్తుందేమో!" రోహిణి అనుమానంగా అడిగింది, శేఖర్ వారించేలోపు.

" పర్వాలేదు శేఖర్, అడగనివ్వండి.”

“చూడండి రోహిణి గారూ, పేషెంట్ వివరాలు ఏమీ చెప్పము. వీలైనంత క్లుప్తంగా పరిస్థితిని వివరిస్తూ సహాయం కోరతాం. మీరు బాగా తెలిసినవారైతే తప్ప ఎవరికీ విషయం తెలియదు" అంటూ వివరించారు.

అన్నట్టే వెంటనే రంగంలోకి దిగారాయన.

‘తనకెంతో ప్రియమైన, ప్రతిభ గల క్రీడాకారిణి అయిన చిన్న పాప ప్రాణాంతకమైన కేన్సర్ తో బాధపడుతోందనీ, ఆమె కుటుంబానికి గానీ, వారి బంధువులు, పరిచయస్థులకి గానీ ఆమె వైద్యాన్ని భరించగలిగేంత శక్తి లేదు, కనక ఇది చూసినవారు స్పందించి తమకి వీలైనంత సహాయం చెయ్యగలిగితే ఆ పాపకెంతో మేలు చేసినవారవుతారని ‘ చెప్తూ, తగినంత వివరాలని పొందుపరచిన ప్రకటన తయారుచేశారు.

స్వప్నిక వి కానీ, పాప తల్లితండ్రుల గురించి కానీ ఏమీ చెప్పకుండా జాగ్రత్త తీసుకున్నారు.

అది త్వరలోనే అన్ని ప్రముఖ పేపరలలోనూ, సోషల్ మీడియా వేదికలలోనూ వచ్చేలా చూశారు.

పిల్లలకంట పడకుండా ఆ పేపర్ని తీసి దాచిపెట్టింది రాధిక.

అప్పటినించీ ఆమెలో పట్టలేనంత ఆత్రుత.

"ఎవరైనా పంపండం మొదలు పెట్టారో లేదో?"

" చూసిన వెంటనే ఇచ్చేస్తారా ఎవరైనా? ఇస్తే ఎంత బావుంటుందో! ఇవ్వకపోతే తర్వాత చూద్దాం లే అనుకుని మర్చిపోతారా?”

" ముక్కూ, మొహమూ తెలియని వారికి సహాయం చేసేదేమిటి అనుకుని వదిలేస్తారా?"

" ఇది అసలు నిజమని నమ్మకమేమిటి? ఇలాంటివెన్ని చూడటం లేదు! అనుకుంటారా?"

“ఒకవేళ ఇలాంటి ప్రకటన తను చూసినా అలాగే అనుకుంటుంది కదా, వెంటనే సహాయం చెయ్యాలని అనుకోదు కదా!”

ఇలా ఆమె మనసులో చెప్పలేనన్ని ఆలోచనలు, అనుమానాలు.

ఎవర్ని అడగాలో, తెలియలేదు. అసలు డబ్బులు వచ్చాయో, లేదో?

ఎవరైనా ఇస్తారో లేదో అసలు! ఇచ్చినా ఎంత ఇస్తారు? మహా అయితే వెయ్యి రూపాయలిస్తారేమో! తెలిసినవాళ్ళకే అంతకంటే ఇవ్వరు.

అసలు డాక్టర్ గారిని అడగడం ఎలా? అలా అడిగితే బావుంటుందా?

ఇలాంటివి రోహిణికి వచ్చే అనుమానాలు.

డాక్టర్ గారు ఫోన్ చేసి చెప్తే బావుంటుంది కదా అని ఒకసారి. అవసరం అయితే ఆయనే చేస్తారు కదా, అయినా ఇదొక్కటే పనా ఆయనకి అని మరొకసారి! పిల్లలూ, మగవాళ్ళూ లేని సమయాల్లో ఇవే చర్చలు స్నేహితురాళ్ళిద్దరి మధ్య.

వాళ్ళు ఎదురు చూస్తున్నట్టే ఒకరోజు ఫోన్ చేసి రమ్మన్నారు రాజేష్.

ఆత్రుతగా వెళ్ళిన ఆ నలుగురినీ కూర్చోబెట్టి, తాను అనుకున్నంత స్థాయిలో కాకపోయినా కొద్ది, కొద్దిగా సహాయం అందడం మొదలయిందనీ, అన్నీ తాను అనుకున్నట్టుగా జరిగితే విషయం మరింతమందికి తెలిసి ఇంకా వస్తుందని నమ్మకంగా చెప్పారు రాజేష్ .

ఇప్పటిదాకా ఎంత వచ్చిందో తెలుసుకోవాలని కుతూహలపడింది రోహిణి కానీ అడగలేకపోయింది ఆయనను.

విదేశాల్లో స్థిరపడిన తన డాక్టర్ మిత్రులందరికీ చెప్పానని, వాళ్ళు కూడా పంపుతారని చెప్పారు.

అలాగే ఆ ఇద్దరు దంపతులనీ కూడా తమకి తెలిసినవాళ్ళందరికీ మెసేజ్ లు పంపమని చెప్పారు.

' బిందె నిండాలంటే ప్రతి నీటిబొట్టూ  విలువైనదే, మన పనికి ప్రతి రూపాయి కావలసినదే' అంటూ వివరంగా చెప్పారు.

తన శరీరంలో గానీ, తన వెనుక గానీ ఏం జరుగుతోందో తెలియని స్వప్నిక మాత్రం ఎప్పటిలాగే హుషారుగా హాయిగా ఉంది.

తరచుగా వస్తున్న జ్వరాలు, సోకుతున్న ఇన్ఫెక్షన్ లు, నీరసంగా అనిపించడం, ఇతర రుగ్మతలు ఇవన్నీ పెద్దగా పట్టించుకోవడం లేదు ఆ పిల్ల.

కాకపోతే జ్వరమూ, జలుబు లాంటివి వచ్చినప్పుడు స్కూల్ మానేసి పడుకోవలసి వచ్చినప్పుడు, పరిగెత్తడానికి బలం సరిపోకపోవడం జరిగినప్పుడు మాత్రం నిరాశపడి బాధపడేది.

ఆ చిరాకులోనే " ఎందుకమ్మా ఈ జ్వరం అసలు వదిలిపెట్టకుండా తరచుగా వస్తోంది? ఇదివరకెప్పుడూ లేదే? నా ఇమ్యూనిటీ తగ్గిపోయిందేమో!" అంటూ అడిగేది.

" అబ్బే ఈ మధ్య కొద్దిగా వీక్ గా ఉన్నావేమో , బాగా తినాలి, చక్కగా వేడి పాలు తాగాలి" ఇలా ఏదో చెప్పి మాట మార్చేది రాధిక.

డా.రాజేష్ బాంక్ అకవుంట్ కి చిన్నా, పెద్దా మొత్తాలలో డబ్బు రావడం కాస్త జోరందుకుంది. దానివల్ల అందరికీ ఆశలు చిగురించి ఉత్సాహంగా అనిపించింది.

మూడు నాలుగురోజులకొకసారి కిరణ్ కి ఫోన్ చేసో, వాళ్ళని పిలిచో వివరాలు చెప్పసాగారు డాక్టర్.

" నాకు బాంక్ అకవుంట్ కి డబ్బులు పంపడాలు అవీ తెలియదు డాక్టర్ గారు. నా రెండు జతల గాజులమ్మిన డబ్బు ఇది.  మీరే మీ అకవుంట్ లో వేసుకోగలరా దయచేసి. ఇలా మీకు పని చెప్తున్నందుకు మరేమీ అనుకోరుగా! మన బంగారు తల్లికి ఆరోగ్యం కుదుట పడితే అంతే చాలు" అంటూ ఒకరోజు ఒంటరిగా వచ్చి డబ్బు ఇచ్చిన రోహిణి ని చూస్తే , రాజేష్ చూసి రాజేష్ ఆశ్చర్యపోయారు

" అయ్యో, ఎందుకండి ఇలా చేశారు? రాధిక కి కిరణ్ కి తెలుసా?" అన్నాడు.

" మనం సహాయం కావాలని అందరినీ అడుగుతున్నాం కదా డాక్టర్. కనకపోయినా నాకు కన్నకూతురులాంటి చిన్నపిల్ల అవసరానికి నేను స్పందించకపోతే ఆ బంధానికి అర్థమేముంది? ఇలా చేస్తానని చెప్తే రాధికా, కిరణ్ ఇవ్వనిస్తారా? మీరే చెప్పండి! ఆ దేవుడు మాకు కాస్త డబ్బు ఇవ్వచ్చు కదా, ఎప్పుడూ మాకు తగినంత లేదని అనుకోలేదు కాని ఇప్పుడు మాత్రం అనిపిస్తోంది. కనీసం కొన్నేళ్ళు, స్వప్ని తల్లికి తగినంత వైద్యం అంది చక్కబడేవరకూ మేము ధనవంతులమైతే బావుండునని." తెలివితక్కువగా ప్రశ్నలు వేస్తుందని భర్తతో తరచూ అనిపించుకునే రోహిణి లోని అమ్మతనం ప్రస్ఫుటమవుతున్న వేళ.

'అమ్మ అనిపించుకోవడానికి జన్మే ఇవ్వక్కర్లే దు' అన్న మాట ఎంత నిజమో! అనుకున్నాడు ఆయన.

మౌనంగా ఆమె ఇచ్చిన డబ్బుని తీసి టేబిల్ సొరుగులో దాచి ఉంచాడు.

కానీ కిరణ్, రాధిక ల దగ్గరనుంచి దాచడం సరి అయిన పని కాదనుకుని నెమ్మదిగా కిరణ్ కి ఫోన్ చేసి చెప్పాడు.

డాక్టర్ చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయాడు కిరణ్. కళ్ళు చెమర్చి చూపు మసకబారింది.

"ఆవిడ ఒక్కరే వచ్చి నాకిచ్చి, మీకు చెప్తే ఒప్పుకోరని చెప్పారు." అంటూ విషయం మొత్తం చెప్పాడు.

ఇదీ అని చెప్పలేని భావాలతో ఒక్క క్షణం మాట్లాడలేకపోయాడు కిరణ్.

" ఎప్పుడో మా నాన్నగారిచ్చిన ఆ గాజులకింతకంటే గొప్ప ప్రయోజనం ఉంటుందని నేను అనుకోలేదు అన్నయ్యా! ఒకవేళ ఉన్నా నాకొద్దు. నాకు కావలసినదల్లా మన పిల్ల పరిస్థితి చక్కబడి, సంపూర్ణ ఆరోగ్యవంతురాలై మన మధ్య గతంలోలా తిరగాలి. అంతకన్నా నేను కోరేది మరేమీ లేదు. దానికి పనికొస్తాయంటే ఆ గాజులే కాదు, ఏమైనా ఇవ్వడానికి సిద్ధమే నేను" అంటూ కిరణ్ చేతులు పట్టుకుని భోరుమంది రోహిణి.

ఆ దంపతులిద్దరికీ తమ పిల్లలంటే ఎంత ప్రాణమో తెలియనివాడు కాదు కిరణ్.

స్వంత తోబుట్టువుకన్నా ఎక్కువే రోహిణి అతనికి.

తమకంటే ఎక్కువగా ప్రేమిస్తారు వాళ్ళని. రోహిణి అయితే మరీనూ. ఈగ వాలనివ్వదు వాళ్ళిద్దరి మీదా.

అయినా కానీ ఆమె నగలమ్మి తెచ్చిన డబ్బుని తీసుకోవడానికి మనస్కరించలేదు అతనికి

" అది కాదమ్మా!" అంటూ ఏదో చెప్పబోతున్న కిరణ్ ని వారిస్తూ

" ప్రస్తుతానికి పని జరగాలి కదా, ఇలా కానివ్వు. తర్వాత చూద్దాం. తను అన్న మాట నిజమే కదా. కావలసిన మొత్తంలో ఏ కొంత సమకూడినా ఉపయోగమే కదా. రోహిణి మాటని కాదనకు" అన్నాడు శేఖర్ కూడా.

దాంతో సరే అనక తప్పలేదు కిరణ్ కి.

పేషెంట్లతో బిజీగా ఉన్న సమయంలో ఆగకుండా మ్రోగసాగింది డాక్టర్ రాజేష్ మొబైల్ ఫోన్.

---

" కెన్ ఐ కాల్ యూ లేటర్?" అని మెసేజ్ పంపించాడు ఆయన ఎప్పటిలాగే.

చేసిందెవరో కూడా పెద్దగా చూడకుండానే ఆటోమేటిక్ బటన్ నొక్కుతూ.

" అస్సలు కుదరదు, నేను సుజిత్ ని. నేను చెప్పేది వింటే ఎగిరి గంతేస్తావు. అందుకని వెంటనే కాల్ చెయ్యి." అంటూ స్నేహితుడు పంపిన తిరుగు మెసేజ్ ని చూసి అప్రయత్నంగానే చిరునవ్వు వచ్చింది ఆయనకి.

పేషెంట్ ని చూసి పంపేసి వెంటనే స్నేహితుడికి ఫోన్ చేశాడు.

" ఐ యాం ఎక్సైటెడ్' అన్నాడు  సుజిత్ ఫోన్ ఎత్తగానే. ఎలాంటి ఉపద్ఘాతమూ లేకుండా

"దేనిగురించి? విషయమేమిటో చెప్పు మరి!"

" స్వప్నిక గురించి" అన్నడాయన, గొంతునిండా ధ్వనిస్తున్న ఉత్సాహంతో..

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments